
మాగ్నిఫిసెంట్
వన్!
N.S
నాగిరెడ్డి

# మాగ్నిఫిసెంట్ వన్

## (ఎ కిల్లర్ స్పై థ్రిల్లర్)

రచన :

N.S నాగిరెడ్డి

Cell : 8885740346
బ్రిలియంట్ బుక్స్
గులాబితోట, విజయవాడ - 3.

**MAGNI FICENT ONE**

A Novel by

**N.S. Nagireddy**

Gulabhi Thota, Vijayawada - 520 003.

Book Edition - March 1988

E : Books First Edtion - 2015

(C) అన్ని హక్కులు రచయితవి

**వెల : రు.**

ప్రచురణ :

**బ్రిలియంట్ బుక్స్**

గులాబితోట, విజయవాడ - 3

సెల్ : **8885740346**

ఈ నవలలోని కథ, పాత్రలు, సంఘటనలూ, సన్నివేశాలూ, కేవలం కల్పితం, ఎవర్నీ ఉద్దేశించి వ్రాయబడినవి కావు.

టైప్ సెట్టింగ్,

**శ్రీ పరమేశ్వరి ప్రెస్,** విజయవాడ - 2.

# మాగ్నిఫిసెంట్ వన్

**టో**నీ మెల్లగా కనులు తెరిచాడు. అదొక చీకటి గది! వారం రోజులుగా తనా గదిలో బంధించబడి వున్నాడు. పొడవాటి  చెక్కకు మధ్యలో గుండ్రంగా రంధ్రం వుండేట్లుగా తొలచబడి వుందా చెక్క.

రెండుగా విడిపోయే ఆ చెక్కను టోనీ మెడచుట్టూ బిగించి, రెండు చేతులను చెక్కకు రెండువైపులా వున్న రంధ్రాల్లో దూర్చి బంధించారు.

తల తిప్పడానికి వీల్లేదు. నేలమీద పడుకోవటానికి వీల్లేదు. ఆ గదిలో, నేలమీద ఎటయినా తిరగవచ్చు. నిద్ర పోవాలనుకుంటే కూర్చుని గోడకు ఆనుకుని నిద్ర పోవాల్సిందే!

టోనీ గెడ్డం బాగా పెరిగిపోవడంతో చికాకుగా వుంది. కనులముందు జరిగింది గుర్తుకొచ్చింది అప్రయత్నంగానే.

టోనీ జీప్‌లోంచి క్రిందకు దిగాడు. ఎదురుగా ఏమెన్ లోని ఆర్మీ కాంప్ స్టేషన్ చెక్క కాటేజ్‌లు కనిపిస్తున్నాయి. ఏమెన్ లోని ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నారు కొంతమంది రషీద్‌లు గెరిల్లా పద్ధతిలో.

అదే పద్ధతిలో వారి నెదుర్కోవటానికి కావలసిన శిక్షణ ఇవ్వడానికి ఆ కాంప్‌కి వచ్చాడు టోనీ. అప్పటికి నెల రోజుల యింది. శిక్షణ సజావుగా సాగిపోతోంది.

టోనీ తాపీగా బిల్డింగ్‌లోకి నడిచాడు. అది మెయిన్ బిల్డింగ్. ఒక వైపున పొడవాటి డైనింగ్ టేబుల్ వుంది. దానిపై డిన్నర్‌కి అన్ని ఏర్పాట్లు చేసి వున్నాయి.

టోనీ అద్దంలో తన ప్రతిబింబం చూసుకున్నాడు. డిన్నర్‌కి ముందుగా తన ఫేవరెట్ డ్రింక్ తీసుకోవడం అతని అలవాటు!

మిర్రర్ ముందున్న బాటిల్‌లోని డ్రింక్‌ని గ్లాసులో ఒంపు కుంటుండగా అద్దం ఒక్కసారి కదిలిపోయింది.

తను నిలబడ్డ ప్రదేశం కంపించి పోవడంతో టోనీ వున్న చోట నుంచి తూలి క్రింద పడిపోయాడు.

లేవడానికి ప్రయత్నిస్తుండగా కనుల ముందు మెరుపు మెరిసినట్లయింది. పిడుగులు పడుతున్నట్లు చప్పుళ్లు విన వచ్చాయి. స్పృహతప్పి అలాగే వుండిపోయాడు మేజర్ టోనీ.

తిరిగి కనులు తెరిచేసరికి ఒక చీకటి గదిలో వున్నాడు టోనీ. మెడకు వున్న చెక్క ప్రక్కకు ఒరగ నివ్వడం లేదు.

అలా ఎంతసేపు గడిచిందో తెలియదు. తరువాత వచ్చాడో వ్యక్తి. టోనీతో మాట్లాడి తాగినన్ని మంచినీళ్ళుపోసి వెళ్ళిపోయాడు సలీమ్ అనబడే అతను.

టోనీ నిజానికి చాలా బలమయిన మనిషి. కాని వారం రోజులుగా తిండి, నిద్ర లేకపోవడంతో బాగా నీరసించి పోయాడు.

కర - కరమని చప్పుళ్లు చేస్తూ తెరుచుకుంది డోర్. వెలుతురు లోపలకు చొచ్చుకు వచ్చింది. టోనీ కనులు చికిలించాడు.

లోపలకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. టోనీ చూస్తుండగానే అతని రెండు భుజాలు పట్టి పైకెత్తారు. గాల్లోకి లేపి గదిలోంచి బయట అరుగు మీదకు తెచ్చి కూర్చుండబెట్టారు.

ఎండ సూటిగా కళ్ళల్లో పడుతుంటే ముందుకు చూడటం కష్టంగావుంది. అది చాలా చిన్న ఒయాసిస్సు. దాని చుట్టూ ఓ పాతిక కొంపలున్నాయి.

ఒయాసిస్సు చుట్టూ ఖర్జూరపు చెట్లు ఎదిగి వున్నాయి. గెలలు వేలాడుతున్నాయి. పదేళ్ళ బాలుడు కొన్ని ఒంటెలను, వాటి పిల్లలను ఒయాసిస్సు కేసి తోలుకెళుతున్నాడు.

అక్కడకు అరఫర్లాంగు దూరంనుంచి దట్టమైన ఇసుక పొరలు ప్రారంభమవుతాయి. వుండుండి గాలి బలంగా వీస్తే ఇసుక తెరలు - తెరలుగా పైకి లేచి దూరంగా ప్రయాణిస్తోంది.

ఎత్తు పల్లాలతో, అద్భుతమయిన డిజైన్‌లు గీసినట్టున్న ఇసుక గుట్టలపై సూర్యకిరణాలు పడి బంగారు రజనులా మెరుస్తున్నాయి ఇసుక రేణువులు.

ఎడమవైపున తోఫార్ కొండగుట్టలు ఆకాశాన్నంటినట్టు కనిపిస్తున్నాయి. ఇసుక మేటలపై నుండి వెచ్చని ఆవిర్లు ఎగసి వస్తున్నాయి.

అలా ఎక్కువసేపు చూడలేక మెడను చెక్కమీదకు వాల్చాడు టోనీ. పెదవులు తడారిపోతున్నాయి. బరువుగా కనురెప్పలు మూతలు పడుతుండగా ఆ ఇంటిముందు ఆగిందో నల్లని బలిష్టమయిన అశ్వం.

దానిమీద నుండి క్రిందకు దిగాడు అరబ్బీ డ్రస్‌లో ఉన్న సలీమ్. ఎడమ భుజానికి చైనీస్ ఏ.కె. ఎస్సాల్ట్ రైఫిల్ వ్రేలాడుతోంది. కుడి భుజానికి బ్రోనింగ్ గన్ వుంది.

నడుంకు వున్న రోప్‌కి వంకీలు తిరిగిన డాగర్ తగిలించి వుంది. కొద్దిగా పెరిగిన కుచ్చు గడ్డాన్ని అరచేత్తో రుద్దుకుంటూ అరబ్బీలో విష్ చేశాడు సలీమ్. టోనీ తిరిగి విష్ చేశాడు.

"మంచినీళ్ళు కావాలా?" అడిగాడు సలీమ్.

"చాలా దాహంగా వుంది!" చెప్పాడు టోనీ పెదవులను నాలుకతో తడుపుకుంటూ.

సలీమ్ తన అనుచరులకు సైగ చేశాడు. ఒకడు కుండను తీసుకుని ఒయాసిస్సు కేసి పోయాడు.

"అయాంసారీ, టోనీ సాహెబ్! ఈ రోజుతో మా బందిఖానా బాధనుంచి మీరు విముక్తులు కాబోతున్నారు!" చెప్పాడు సలీమ్.

"ఏం? ఎందుకని?"

"మిమ్మల్ని రష్యన్స్‌కి బేరం పెట్టాను. ఈ రోజు ఇక్కడకు వచ్చి ఏ నిముషాన్నయినా మిమ్మల్ని పరిశీలిస్తారు. అందుకుగాను రెండు మెషిన్ గన్లు, ఎమ్యూనిషన్, పాతిక గోల్డ్ కాయిన్స్ మాకు ఇచ్చే ఒప్పందం!"

"రష్యన్స్ ఇక్కడ ఎక్కడున్నారు?" అనాలోచితంగానే అడిగాడు టోనీ.

నిజానికి వారెక్కడున్నారో అతనికి తెలుసు. అక్కడకు ఆరు కిలోమీటర్ల దూరంలో వున్న ఫెసార్ అనే ప్రదేశంలో రష్యన్స్ బేస్ వుంది.

ఆ సంగతి బ్రిటిష్ సీక్రెట్ సర్వీస్–ఎస్. ఐ. ఎస్.కి కూడా తెలుసు! ఏమెన్ ప్రభుత్వానికీ తెలుసు. అయినా ఏమీ చేయలేని విచిత్ర పరిస్థితి!

"మేము విప్లవ కారులమనీ, ప్రభుత్వం మమ్మల్ని అణచివేయడానికే మిమ్మల్ని శిక్షణ కోసం పిలిపించిందనీ తెలుసు మీకు. మాకు ఫెసార్ బేస్‌లోని రష్యన్స్ ఎంతగానో హెల్ప్ చేస్తున్నారు. ఆయుధాలు, రెవల్యూషన్ సిస్టమ్స్... అన్నింటికీ మించి వారితో మాకు ఈ వ్యాపారం బావుంది....!" చెప్పాడు సలీమ్ ఆనందంగా.

టోనీ దృష్టి దూరంగా వున్న ఇసుక గుట్టలమీద నిలిచింది. ఒక ఒంటె ఇటువైపుగా కదులుతోంది. ఎవరయి వుంటారు? తనకు మిత్రులు మాత్రం కాదు.

అరబ్బుల్లో సలీమ్ జాతిని రషీద్ అని పిలుస్తారు. ఒయాసిస్సునుంచి రషీద్ కుండతో నీళ్ళు తెచ్చాడు.

"సలీమ్! నీకు కావలసింది గోల్డ్ కాయిన్స్, ఆయుధాలే కదా! నన్ను మా కాంప్ స్టేషన్‌లో అప్పగిస్తే ఇంతకంటే ఎక్కువ బంగారం, వెపన్స్ నీకు అందేట్టు చూస్తాను. ఆలోచించు!" ప్రపోజ్ చేశాడు టోనీ.

సలీమ్ నవ్వాడు. "నీ ప్రపోజల్ బాగానే వుంది. కానీ నేను రష్యన్స్‌కి మాట ఇచ్చాను. రషీద్‌లు మాట తప్పరు!" అంటూ మంచినీళ్లు టోనీకి అందించాడు.

టోనీ గట-గట తాగేశాడు. కుండ సగంవరకూ ఖాళీ అయింది. సలీమ్ సిగరెట్ తీసి వెలిగించి టోనీ పెదాల మధ్య వుంచాడు.

టోనీ ఇసుక గుట్టలకేసి చూశాడు సిగరెట్ పీలుస్తూ. ఒంటె గుట్టలమీద నుంచి దిగిపోయి ఆ ఇంటికేసే వస్తోంది.

ఒంటె నధిరోహించి వున్నాడో అరబ్. సాడిల్స్‌కి అటువైపున ఎవరో వేలాడుతున్నారు. "సలీమ్ ! ఎవరో వస్తున్నట్లున్నారు?" అన్నాడు టోనీ.

"భయంలేదు, మాకు తెలియకుండా ఇక్కడికి ఎవరూ రాలేరు. వచ్చినా పోలేరు!" అన్నాడు సలీమ్ ధీమాగా, వళ్లు విరుచుకుంటూ.

మరో పదినిముషాలు గడిచేసరికి ఒంటె ఇంటి ముందు ఆగి, కాళ్ళమీద క్రిందకు జారింది. దాని మీదున్న వ్యక్తి క్రిందకు దిగాడు.

సాడిల్స్‌కి వ్రేలాడుతున్న వ్యక్తి బంధాలు విప్పి సలీమ్ ముందుకు ఈడ్చుకొచ్చాడు. సలీమ్ ఆ వ్యక్తిని పరిశీలించి చూస్తూ "ఎవరితను?" అని అడిగాడు.

"ఎవరో తెలియదు. ఫెసార్ నుంచి గవర్నమెంటు కాంప్‌కేసి ఎడారిలో నడిచిపోతుండగా దొరికాడు. ఎవరయినా మనకుపయోగించవచ్చు అని బంధించి తీసుకొచ్చాను...!" చెప్పాడతను.

అతని ముఖం చూడగానే రష్యన్ అని తెలిసిపోతోంది. సుమారు యాభైఏళ్ళ పైన వయసు వుంటుంది.

టోనీ అతన్ని రష్యన్ భాషలో ప్రశ్నించాడు. “ఎవరు మీరు? ఆ కాంప్‌కి చెందిన మేజర్‌ని నేను. మిమ్మల్ని చూస్తుంటే ఫెసార్ బేస్ నుంచి తప్పించుకుని పారిపోతున్నట్లనిపిస్తోంది!”

“అవును. నా పేరు కాసిమోవ్! రష్యన్ విధానాలంటే నాకు నచ్చవ్ ! నేను ఎప్పుడయినా తప్పించుకోవచ్చు ననే వుద్దేశ్యంతో నా భార్యని తమ కస్టడీలో వుంచుకున్నారు. సంవత్సరం క్రితం నా భార్య చనిపోయింది. దాంతో వారికి వున్న ఒకే ఒక ఛాన్స్ పోయింది. నేను అక్కడనుంచి తప్పించుకున్నాను. కానీ వెంటనే పట్టుకున్నారు. నన్ను ఫెసార్ కాంప్‌కి పంపించారు. రాత్రి నాకు అవకాశం లభించగానే అక్కడనుంచి తప్పించుకుని మీ కాంప్‌కేసి బయలుదేరాను, మధ్యలో ఇతని చేతుల్లో పడ్డాను.”

టోనీ నవ్వాడు. “అది నీ బాడ్‌లక్ కామ్రేడ్! నన్ను ఫెసార్ బేస్‌లోని రష్యన్స్‌కి బేరం పెట్టారు. నాతోపాటు నిన్ను కూడా తిరిగి రష్యన్స్‌కి అమ్మేస్తారు.”

ఆ రష్యన్ మొహం నల్ల బడిపోయింది. “నేను పడ్డ ఇంత శ్రమా దుర్వినియోగం అయినట్లేనా?”

“అంతే అనుకోవచ్చు!” అన్నాడు టోనీ నీరసంగా నవ్వుతూ.

చీకటి పడుతుండగా రెండు గుర్రాలు ఆ ఇంటిముందు ఆగాయి. బలంగా వున్న ఇద్దరు రష్యన్స్ లోపలకు వచ్చారు.

ఆ వృద్ధుడిని చూడగానే ఆ ఇద్దరూ గొల్లుమని నవ్వుకున్నారు. "వీడికి తప్పించుకోవడం బాగా ప్రాక్టీస్ అయినట్లుంది. పాపం, అలాగే మధ్యలోనే తిరిగి దొరికిపోవడం కూడా అలవాటే కాబోలు."

రష్యన్ భాషలో వారు చేస్తున్న కామెంట్‌లు టోనీకి కూడా అర్థమవుతున్నాయి. తమ అదృష్టం పూర్తిగా ముఖం చాటు వేసిందనడానికి నిదర్శనం కళ్ళముందే కనిపిస్తోంది.

రషీద్‌లు వారి వేళాకోళాన్ని కట్‌చేసి డైరెక్టుగా విషయంలోకి వచ్చేశారు.

"ఇద్దరు మనుషులు. వీడు ముసలాడయినా, రెండోవాడు మాత్రం దుక్కలాంటివాడు. ఎంతివ్వగలరు?"

"వీడు అమెరికన్ కనుక మాకు ఏమయినా ప్రయోజనం వుండచ్చు. ఈ ముసలాడి వల్ల మాకు ఒరిగేదేమీ వుండదు." అన్నాడో రష్యన్ తేలికగా.

"వాళ్ళవల్ల మాకు ఎలాంటి ఉపయోగం వున్నా లేకున్నా మేమివ్వగలిగేది నీకు తెలుసుగా. అంతకు మించి ఎక్కువ ఇవ్వం!"

సలీమ్ ముఖం ఎర్రబారిపోయింది.

"ఒక్కో మనిషికీ ఒక్కో గోల్డ్ కాయిన్, ఒకో ఆటోమాటిక్ రైఫిల్ ఇవ్వడం చాలా తక్కువ అని మాకు తెలుసు. ఈ అమెరికన్‌ని వారంరోజులుగా పోషించడానికి మేము ఎంత ఖర్చు పెట్టామో ఆలోచించండి!"

"కథలు చెప్పక సలీమ్! ఈ అమెరికన్ మొహం చూస్తేనే తెలుస్తోంది మీరు అతన్ని ఎంత ఘనంగా పోషించారో. బేరంలో

ఎలాంటి మార్పులకీ, చేర్పులకి తావులేదు. కొత్త ప్రపోజల్స్ వద్దు!"

"ఇద్దరిమీద కలిపి మరో రైఫిల్ అయినా ఎక్కువ ఇవ్వండి!" కొద్దిగా దిగాడు సలీమ్.

రష్యన్స్ మాత్రం కొంచెం కూడా దిగలేదు. చివరికి సలీమ్ పూర్తిగా లొంగిపోయాడు.

"ఆల్‌రైట్....! అవే ఇప్పించండి! నెక్స్‌ట్ టైం నుంచి గన్స్ మోడల్ మార్చాలి...!" అన్నాడు మెల్లగా నసుగుతూ.

"అప్పుడు ఆలోచిద్దాం!" అన్నాడు ఆ రష్యన్.

అనంతరం మరో రెండు గంటల్లో మార్పిడి జరిగి పోయింది. ఆ వృద్ధుడితోపాటు టోనీని కూడా ఫెసార్‌లోని స్థావరానికి తరలించారు.

ఫెసార్‌లోని కాంప్‌బేస్ ఎడారిలో నిర్మించబడింది. సున్నంతో నిర్మించబడ్డ బారక్స్, గదులూ, ముందు భాగంలో మూడు లాంచర్ లోడెడ్ ట్రక్కులు వున్నాయి.

మధ్యలో చెక్కలతో నిర్మించబడిన కాటేజీ వుంది. లోపల మాత్రం అత్యద్భుతంగా డెకరేట్ చేయబడి వుంది. లోపల రష్యన్స్ ఏదో పార్టీ చేసుకుంటున్నారు.

టోనీని, వృద్ధుడిని ఒకే సెల్‌లో పడేశారు. బయట తాళంపడిపోగానే వృద్ధుడు బరువుగా నిట్టూర్చాడు రాతిమీద కూర్చుంటూ.

"ఏమిటి సంగతి?" ప్రశ్నించాడు టోనీ.

"ఈ గదుల్లోకి వచ్చాక చెప్పుకోవడానికి సంగతులు అంటూ ఏమీ మిగలవు. ఇక్కడే మన దేహాలు అస్థిపంజరాలుగా మారిపోతాయి!" తెలియజేశాడా వృద్ధుడు.

టోనీ పెదవి కదిలించలేదు. ముసలాయన చెప్పకపోయినా ఆ సంగతి అతనికి తెలుసు. ఇంతవరకూ రష్యన్ స్థావరాల్లో అతడు బందీగా ఏర్పడే పరిస్థితి వాటిల్లక పోయినా గూఢచారి జాతి ఆ ఏర్పాట్ల గురించి కథలు చెప్పుకోవడం వినే వున్నాడు.

"సైబీరియా గురించి నీకు ఏమయినా తెలుసా?" మెల్లగా అడిగాడా వృద్ధుడు.

తెలియదన్నట్లు తల అడ్డంగా ఆడించాడు టోనీ. వృద్ధుడు నవ్వాడు చిన్నగా. "తెలియక పోవడమే మంచిదిలే...! తెలిస్తే భయంతో క్షణ - క్షణం చస్తావు."

టోనీ మౌనంగా వుండిపోయాడు. రషీద్‌ల చేతుల్లోంచి ఏదో విధంగా తప్పించుకుంటాననే ఆశ వుండేది.

ఇక్కడనుంచి తప్పించుకుంటాననే ఆశ ఎప్పటికీ వుండదు. అయిపోయింది. మోకాళ్ళ మీద చేతులానించుకుని కూర్చుండిపోయాడు.

క్రమంగా చీకటి పడిపోయింది. ఒంటరిగా కూర్చోవడం, గడపడం చాలా కష్టమయిన పని. చాలా చికాకుగా వుంది వృద్ధుడికి.

రాత్రి తొమ్మిది గంటలవుతుండగా తలుపు తెరుస్తున్న చప్పుడు అయింది.

"భోజనం తెచ్చి వుంటారు. లే... ఎంత క్రుంగిపోయినా ప్రయోజనంలేదు....!" అన్నాడు వృద్ధుడు వేదాంతిలా.

తలుపు కిర్రుమని తెరుచుకుంది. టోనీ తల ఎత్తాడు. నల్లని గౌనులాంటిది ధరించిన మనిషి రెండు ట్రేలు ఒకదాని మీద ఒకటి వుంచుకుని లోపలకొచ్చాడు.

ఎర్రబడివున్న అతని మొహన్ని చూడగానే బిత్తరపోయాడు టోనీ. అతను సలీమ్!

"ఆశ్చర్యంగా చూడవద్దు....! నేను మీ కోసమే వచ్చాను. కమాన్, లేవండి...!" అన్నాడు సలీం గుస - గుసగా.

"మా కోసమా? మామీద ఇంకా ఏమైనా పగతీర్చు కోవాలా?" విరక్తిగా అడిగాడు టోనీ.

"మిమ్మల్నిక్కడ నుంచి తప్పించడం కోసం!" ఇంకా మెల్లగా చెప్పాడు సలీం.

టోనీ, వృద్ధుడు ఒకరి మొహాలొకరు ఏమాత్రం నమ్మలేనట్లు చూశారు.

"తప్పించడం కోసమా? దేనికి? తీసుకుపోయి మరోసారి అమ్ముతావా?" చిరాకుగా అన్నాడా వృద్ధుడు.

"ఫూలిష్‌గా మాట్లాడక...! ఈ రష్యన్స్ నన్ను చాలా ఘోరంగా మోసం చేశారు. ఇంతవరకూ వీళ్ళకు యాభైమందిని అమ్మాను. అంటే నాకు వంద బంగారు నాణాలు ఇచ్చారు. అవన్నీ నిజమైనవే అనుకున్నాం. అందుకే వాటినింతవరకూ అమ్మకుండా, వినియోగించకుండా దాచాను. కానీ అవేమిటో రెండు గంటల క్రితం తెలిసింది!" అన్నాడు సలీమ్ బాధ నిండిన కంఠంతో, కోపంగా.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Magnificent+One**

* * *